# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



పరిగి, ఆగస్టు 21: ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన డబ్బులకు సంబంధించిన చెక్కులను బుధవారం పరిగిలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ. 1,70,000లకు సంబంధించిన చెక్కులు లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

## ఎన్నికల్లో పోటీకి సంతానం నిబంధన తొలగించాలి



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న మండల నాయకులు

బంట్వారం, అగస్టు 21 : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉన్న ముగ్గురు పిల్లల నిబంధనను తొలగించాలని కోరుతూ మండల నాయకులు బుధవారం శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. 1995 చట్ట ప్రకారం ఇద్దరు కంటే ఎక్కువ సంతానం కలిగిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా ఉందన్నారు. ఈ చట్టాన్ని సవరించి, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సంతానం నిబంధనను తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, నాయకులు రాములు, గిరిదాస్, శ్రీనివాస్, సుదర్శన్, వెంకటేశం, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

## అవినీతిని అరికట్టేందుకే సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీలో పాల్గొన్న డీఆర్డీవో శ్రీనివాస్, అధికారులు

కులకచర్ల, ఆగస్టు 21 : ఉపాధిహామీ పథకంలో అవినీతిని అరికట్టేందుకే ప్రతి సంవత్సరం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వికారాబాద్ డీఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కులకచర్ల మండల కేంద్రంలోని ఆయ్యప్పస్వామి దేవాలయం ఫంక్షన్ హాల్‌లో 14వ ఉపాధిహామీ ప్రజావేదిక కార్యక్రమాన్ని ఎంపీడీవో రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రతి గ్రామంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన పనులను సామాజిక తనిఖీ సీఆర్పీలు గత పదిరోజులుగా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి విచారణ నిర్వహించారన్నారు. పనుల్లో అక్రమాలు, మరే విధమైన పొరపాట్లు చేసినా సంబంధిత సిబ్బంది నుంచి డబ్బులు రికవరీ చేస్తామని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కులకచర్ల ఉమ్మడి మండల పరిధిలో రూ.9.44కోట్ల పనులు ఈ సంవత్సరానికి ఖర్చు చేశారని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలను సీఆర్పీలు తీసుకొని ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారని అన్నారు. అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, ఉపాధిహామీ పథకం ఏపీడీ సరళాదేవి, తహసీల్దార్ మురళీధర్, అంబుడ్స్‌మెన్ రాములు, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి భార్గవి, ఎంపీవో కరీం, ఏపీవో వెంకటేశ్‌గౌడ్, ఈసీ చంద్రశేఖర్, సామాజిక తనిఖీ బృందం ఎస్‌ఆర్పీ స్వామి, రవి, మండల డీఆర్పీలు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

## వైభవంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



కొడంగల్, ఆగస్టు 21: పట్టణంలోని రాఘవేంద్రస్వామి దేవాలయంలో స్వామి వారి ఆరాధనోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రథోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు అక్కి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకం, అలంకరణసేవతో పాటు అష్టోత్తర శతనామావళి వంటి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఎల్వోసీ అందజేత

ధారూరు, ఆగస్టు 21; ధారూరు మండల పరిధిలోని కెరెళ్లి గ్రామానికి చెందిన పి. రాంబాబుకు వైద్య సేవల నిమిత్తం రూ. 2.5లక్షలు సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద ఎల్‌ఓసీని వికారాబాద్ నియోజకవర్గ బీజేపీ పార్టీ కో–అర్డినేటర్ వడ్లనందు బుధవారం అందజేశారు

**IN THE COURT OF THE HON'BLE IX ADDL. DISTRICT & SESSIONS JUDGE RANGAREDDY DISTRICT, AT : L.B.NAGAR**
**E.P.No. 1537 of 2022**
**BETWEEN:**
M/s. Manappuram Finance Ltd., Rep. by its Authorized Signatory ...Decree Holder
**AND**
Bandari Srinivasulu ...Judgment Debtors
To
**JDR No. 1:-** Mr. Bandari Srinivasulu, S/o. Bandari Kistaiah, Age: Major Years, Occ: Business, R/o. H.No. 1-08, Singam Pale Village, Aurpally, Amangal Mandal, Mahabubnagar.
Where as the Decree-Holder have filed the above Execution Petition against you and the Hon'ble Court was pleased to pass orders by permitting the Decree-Holder to serve substitute service of notice to you. Therefore, please to take notice that the above Execution Petition is posted to **03-09-2024** for your appearance. Hence, you are here by directed to be present before the above said Court on **03-09-2024** at 10.30 A.M. either in person or through Advocate, failing which the matter will be decided exparte against all of you.
(BY ORDER OF THE COURT)
**M/S. N.RAGHUVEER, M.NARSIMHA, I.SHARATH KUMAR**
Advocate & Associates
Narayanaguda, Hyd-29, **Ph: 9177696253.**

### రైతులందరికీ రుణ మాఫీ చేయాలని
## నేడు ఆందోళన

దోమ,ఆగస్టు 21: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణ మాఫీ చేయాలని కోరుతూ గురువారం ఉ. 10 గంటలకు దోమ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బొంపల్లి మాజీ ఎంపీటీసీ రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల హెడ్‌క్వార్టర్‌లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు నుంచి దోమ ఎస్బీఐ బ్యాంకు వరకు అక్కడి నుంచి దోమ బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు బొంపల్లి గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# మాకేదీ రుణమాఫీ..?

### కంసాన్‌పల్లిలో సగానికి పైగా రైతులకు వర్తించని రుణమాఫీ



తాండూరు, ఆగస్టు 21: రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆంక్షల కొరడా విదిలించడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సవాలక్ష కొర్రీలతో తాండూరు నియోజకవర్గంలో సగం మంది రైతులకు పైగా రుణమాఫీ కాలేదు. ఏడు నెలలుగా ఎదురుచూస్తున్న రైతులు సీఎం రేవంత్‌రెడ్డిపై గుర్రుమంటున్నారు. బషీరాబాద్ మండలం కంసాన్‌పల్లిలో సైతం సగానికి పైగా రైతులకు రుణమాఫీ కాలేనట్లు గ్రామస్తులు 'నమస్తే తెలంగాణ' ముందు వాపోయారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ అందరికీ చేయాలని డిమాండ్ చేశారు.

### పంద్రాగస్టు పాయే మాఫీ కాకపాయే



సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో రూ.2 లక్షల వరకు ఏక కాలంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారం రాగానే ఆంక్షల కొరడా ఝుళిపిస్తూ.. సవాలక్ష కొర్రీలతో మూడు విడుతలు ముగిసినా రుణమాఫీ చేయలేదు. నాకు బ్యాం కులో రూ.1.60 లక్షల రుణం ఉన్నది. మూడు విడుతల్లో అసలేమీ కాలేదు. ఇక అయితదన్న నమ్మకం వస్తలేదు. ఎందుకు ఇట్ల అంటే ఎవరు చెప్తలేరు. కాంగ్రెస్ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి రైతులను ఇలా ఇబ్బందులు పెట్టడం పద్ధతిగా లేదు. ఇప్పటికైనా రైతుల బాధలు తెలుసుకొని రూ.2 లక్షల రుణమాఫీ అందరికీ చేయాలి. లేదంటే ఉద్యమ పోరులా రుణమాఫీ పోరు చేస్తాం.

– సిద్రామప్ప, కంసాన్‌పల్లి

### అందోళనతో తిండేపోతలేదు..



రుణమాఫీ కోసం ఏడు నెలల నుంచి ఎదురు చూస్తున్నా ఇప్పటికీ కాలేదు. మూడు విడుతలు రుణమాఫీలు ప్రకటించినా నాకు ఉన్న రూ.2 లక్షలు అప్పు పోలేదు. మొదటి, రెండో విడుతలో రాకపోయిన మూడో విడుతలో పేరువస్తుందని ఎంతో ఆశతో ఎదురు చూశాను. కాంగ్రెస్ పాలనలో నిరాశనే కలిగింది. బీఆర్‌ఎస్ పాలనలో ఇలా జరగలేదు. రైతులందరికీ న్యాయం జరిగింది. కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలతో ఎంతో సంతోషంగా ఉంటిమి. ఇప్పుడు చాలా కష్టాలు పడుతున్నాం. పండుగలా చేసుకున్న వ్యవసాయం ఇప్పుడు దండుగ అనిపిస్తున్నది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వెంటనే అందరికి రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి.

– హన్మంత్‌రెడ్డి, కంసాన్‌పల్లి

# దెబ్బ తిన్న పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి జ్యోతి

వికారాబాద్, ఆగస్టు 21: అకాల వర్షాలతో రైతుల పంటలు కొంత మేర దెబ్బతిన్నట్లు వికారాబాద్ మండల వ్యవసాయాధికారి జ్యోతి తెలిపారు. బుధవారం వికారాబాద్ మండల పరిధిలోని మైలార్ దేవరంపల్లి గ్రామంలో నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ మైలార్‌దేవరంపల్లి గ్రామ రైతుల పొలాలు వాగుకు దగ్గరలో ఉండటం వల్ల వర్షపు నీరు పొలాల్లో నుంచి వెళ్లిందన్నారు. దీంతో పంటలు కొంత మేరకు పాడైనట్లు తెలిపారు. ఇందులో పత్తి, వాము, టమాట తదితర కూరగాయలు పంటలు పాడైనట్లు వివరించారు. దాదాపు 32 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయ్యాయన్నారు. పంట నష్టాన్ని అంచవేసి పై అధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఆమె తో పాటు ఏఈవో ఫరీన్ ఉన్నారు.

## అపూర్వ సమ్మేళనం..



కులకచర్ల, జూలై 21: మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 1993–94 సంవత్సరం పుట్టపహాడ్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గత మధుర జ్ఞాపకాలను ప్రత్యక్ష్యంగా పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు.

### ముగ్గురు అధికారులు బదిలీ

వికారాబాద్, ఆగస్టు 21: జిల్లాలో ముగ్గురు అధికారులు బుధవారం బదిలీ అయ్యారు. వికారాబాద్ జిల్లా వ్యవసాయా ధికారిగా విధులు నిర్వ హించిన గోపాల్ యాదాద్రి భువనగిరి డీఏవోగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ కార్యాలయంలో పని చేసిన మోహన్‌రెడ్డి జిల్లా వ్యవసాయాధికారిగా నియమితులయ్యారు. జిల్లా పౌరసరఫరాల అధికారిగా పనిచేసిన రాజేశ్వర్, డీఎంగా పని చేసిన సుగుణాబాయి బదిలీ అయ్యారు.

### కల్తీ కల్లు తాగి ఒకరు మృతి

వికారాబాద్, ఆగస్టు 21 : కల్తీ కల్లు తాగి ఒకరు మృతి చెందిన ఘటన వికారాబాద్ పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ మండలం పీరంపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్య(57) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. సోమవారం రాత్రి గ్రామంలో కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురయ్యాడు. మంగళవారం వికారాబాద్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స తీసుకుంటున్నాడు. అర్ధరాత్రి దుర్గయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. పీరంపల్లి గ్రామంలో కల్తీ కల్లు తాగిన దాదాపు 30 మంది దవాఖానలపాలయ్యారు. వాంతులు, విరేచరాలతో ఆయా దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

**పీరంపల్లిలో మెడికల్ క్యాంప్**

బుధవారం వికారాబాద్ మండలం పీరంపల్లిలో ఎంపీడీవో వినయ్‌కుమార్, ఎంపీవో, మండల వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. కల్తీ కల్లు బారిన పడ్డవారిని గుర్తించి చికిత్స నిమిత్తం మెడికల్ క్యాంప్‌నకు తరలించారు. గ్రామాల్లో పలువురికి వాంతులు, విరేచనాలు కావడంతో వారికి వైద్య అధికారులు, సిబ్బంది ప్రథమ చికిత్సలు నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని మెరుగైన చికిత్సల కోసం వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు, ఇతర దవాఖానలకు పంపించారు. గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. వారితో పాటు వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

### భక్తి భావం ఉంటేనే..
## భగవంతుడి అనుగ్రహం



ప్రసంగిస్తున్న శ్రీ జగద్గురు నిరంజన మఠం పీఠాధిపతులు

కొడంగల్, ఆగస్టు 21: భక్తి భావం నెలకొని ఉన్నప్పుడే భగవంతుడి అనుగ్రహం ఉంటుందని శ్రీ జగద్గురు నిరంజన మఠం పీఠాధిపతులు శ్రీ సిద్ధిలింగ మహాస్వామి అన్నారు. బుధవారం స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంతో పాటు మండలాల వారీగా నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యపూజలు, భక్తి, విభూతి ధారణ, ప్రవచనాలు చేపట్టుకోవడం వల్ల మనస్సు ఆనందంగా, ప్రశాంతతో పాటు ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. మనస్సును భక్తితో జయించాలన్నారు. కార్యక్రమంలో శ్రీ పశ్చిమాద్రి సంస్థాన విరక్త మఠం పీఠాధిపతులు పంచమ సిద్ధలింగ మహాస్వామి, కర్ణాటక రాష్ట్రంలోని జాన్‌పల్లి మఠం పీఠాధిపతులు అభినవ గవి సిద్ధలింగేశ్వర మహాస్వామి, ముఖ్య వక్తగా జగద్గురు పంచాచార్య వీరేశం, ఆగమ పాఠశాల ఆచార్యులు శ్రీసంగయ్యస్వామితో పాటు మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, విజయవర్ధన్, రాష్ట్ర వీరశైవ గజదేవ్ హీరేమఠ్ నియోజకవర్గంలోని మండలాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



వికారాబాద్, ఆగస్టు 21 : వికారాబాద్ పట్టణం కొంపల్లి సమీపంలో ఉన్న మహిమ మినిస్ట్రీస్ వృద్ధ అనాథ ఆశ్రమంలో బుధవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కుమారుడు శ్రీకాంత్ జన్మదిన వేడుకలు జరిగాయి . ఆశ్రమంలో ఉంటున్న అనాథలందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులను సన్మానించారు. శ్రీకాంత్ స్నేహితుడు నర్సింహులు, శ్రీకాంత్ సోదరుడు చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### అకారణంగా ఆటో డ్రైవర్‌ను కొట్టిన డీఎస్పీ

వికారాబాద్, ఆగస్టు 21 : వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి భూమి పూజ చేసేందుకు వస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వికారాబాద్ డీఎస్పీ శ్రీని వాస్‌రెడ్డి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఇందులో భాగంగా స్పీకర్ కాన్వాయ్ వస్తుం డటంతో పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఆటో నిలిపిన డ్రైవర్ నర్సింహులును డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి కొట్టాడు. తనను అకారణంగా కొట్టాడని బాధితుడు మీడియాకు వివరించాడు. అదే సమయంలో ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని వికారాబాద్ నుంచి ధారూరు వెళ్లాలనుకున్నాడు. రోడ్డు పక్కన నిలిపిన ఆటోను చూసి, డ్రైవర్‌ను డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా కొట్టినట్లు తెలిపాడు. అతడి కుడి చెయ్యికి బలమైన గాయం కావడంతో కన్నీరు మున్నీరుగా విలపించాడు.

కాగా ఆటో డ్రైవర్ నర్సింహులు ధారూరు మం డలం అల్లీపూర్ గ్రామానికి చెందిన వాడు. విషయం తెలుసుకున్న ఆటో యూనియన్ నాయ కులు ఆయనను పరామర్శించారు. పోలీసుల దురుసు ప్రవర్తనపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### సరళమైన ఓటరు జాబితా ఏర్పాటుకు
# అన్ని పార్టీలు సహకరించాలి




సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్, ఆగస్టు 21: సరళమైన ఓటరు జాబితాను సిద్ధం చేసుకునేందుకు గాను అన్ని పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ కోరారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలను పురస్కరించుకొని ఓటరు జాబితాను పునరుద్ధరించుకునేందుకు అన్ని పార్టీలు సహకరించాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలో ఏమైనా మార్పులు, చేర్పులు, మృతి చెందిన ఓటర్లను తొలగించడం, 18 సంవత్సరాలు పైబడిన యువతీ, యువకులకు ఓటు హక్కును కల్పించేందుకు గాను సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఆనంద్‌రావు, కృష్ణంరాజు, గుల్షన్, శ్యాంసుందర్, శంకర్‌నాయక్, చంద్రప్పలతో పాటు డిప్యూటీ తహసీల్దార్ అనిత, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సీడీపీవో



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులతో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీలక్ష్మి

తాండూరు రూరల్, ఆగస్టు 21 : తాండూరు మండలం, అంతారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో శ్రీలక్ష్మి బుధవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బోధనపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా? లేదా? అని అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణులతో మాట్లాడారు. ప్రతి నెలా తప్పకుండా దవాఖానకు వెళ్లి, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

## సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పెద్దేముల్ ఏఎస్ఐ బక్కన్న

పెద్దేముల్, ఆగస్టు 21 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దేముల్ ఏఎస్ఐ బక్కన్న సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజలకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, డ్రంక్ అండ్ డ్రైవ్, డయల్ 100 తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్‌లకు వచ్చే ఏపీకే లింకులను ఎవ్వరు కూడా ఓపెన్ చేయరాదని, కాదని అలా ఓపెన్ చేస్తే తమ ఖాతాల్లో పైసలు మాయమైపోతాయని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని, రోడ్లపై ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, వాహనాలకు అన్ని రకాల ధ్రువ పత్రాలను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ బాల్‌రాజ్ గౌడ్, జగన్, మురళి పాల్గొన్నారు.

### బస్ డిపో ఎదుట నిరసన



వికారాబాద్, ఆగస్టు 21: వికారాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం బస్ డిపో ఎదుట ఎస్సీ ఎస్టీ వర్గీకరణపై మాల మహానాడు నాయకులు బైఠాయించి బస్సులు బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ రిజర్వేషన్ బచావో సంఘర్ష్ భారత్ బంద్ లో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో గల ఆర్టీసీ బస్ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ బస్సులను మాలల ఐక్యవేదిక నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**
★ కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
**NT- 326218**

**WANTED**
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
**NT-325792-All**

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962